
**వరద గోదారి ఉరుకులూ—పరుగులూతో ఊగిపోతోంది. అమ్మమీద కోపం వచ్చి రోడ్డు మీద అడ్డంగాపడి దొర్లుతూ, కాళ్ళూ చేతులూ కొట్టుకుంటూ నానా హంగామా చేస్తున్న పెంకిపిల్లాడిలా అల్లరి చేస్తోంది గోదారి.**

# వరద

బులుసు వెంకటేశ్వర్లు



ఏటిగట్టు దిగువునే పెద్దిరాజు వందెకరాల ఆయకట్టు.

వుట్టి రణ్ణాల్లు కూడా కాని వరిమొక్కలు ప్రచండవేగంతో వీస్తున్న ఈదురుగాలికి విభ్రాంతితో ఊగిపోతున్నాయ్.

ఊరంతా హడావిడిగా ఉంది. నాల్రోజుల్నించి ఎవ్వరికీ కంటి మీద కునుకులేదు.

ఏ నోటవిన్నా "ఎల్లా ఉంది వరద?"—ఇదే ప్రశ్న.

అందరి గుండెల్లో భయం! ప్రాణభయం!

ఊరి జనం అంతా ఒక్కటయ్యారు. గట్టు అవుకుగా ఉందనుకొన్న చోట ఇనకబస్తాలు పేరుస్తున్నారు. వాటికి దన్నుగా కఱ్ఱలు పాత్తున్నారు.

పెద్దిరాజు ట్రాక్టరిచ్చాడు. దిబ్బమీది ఇనక కావలసినంత తవ్వుకుపొమ్మన్నాడు. కఱ్ఱలికి చెట్లు చూపించాడు.

వస్తే సే జనానికి సారా ఖర్చులు కూడా తన సొంత జేబులోంచి తీసిస్తున్నాడు.

"పెద్దిరాజు దరమపెబువు" అని చేతులు జోడిస్తున్నారు పేటలో జనం అంతా.

ఏటిగట్నే వస్తున్న గడ్డెయ్యకి వంతులుగారి అమ్మాయి తలవుకొచ్చింది.

"ఎల్లాగుందో మహాతల్లికి? పావం! వంతులుగోరి మొకం సూస్తే వుట్టెడు జాలేసింది" అనుకున్నాడు గడ్డెయ్య.

పొద్దుటే పెద్దిరాజు మకాం నుంచి పేటకి వెళుతుంటే వంతులుగారి ఇంటిముందు ఆడంగులు అంతా పోగయ్యున్నారు.

వంతులుగారు వాకిట్లో మంచం మీద కూర్చున్నారు దిగులుగా.

"ఏంబాబూ, ఏమైంది" ఆత్రంగా అడిగాడు గడ్డెయ్య రోడ్డు మీదే నిలబడి.

"అమ్మాయికి రాత్రి నుంచీ నొప్పులొస్తున్నాయిరా. పిల్ల చాలా బాధవడుతోంది. పట్నం నించి డాక్టర్ని తీసుకువద్దామంటే దారిలేదు. గోదారి దాటింపులేదు. ఏంజెయ్యాలో పాలుపోవడం లేదు." దాదావు ఏడుస్తూనే అన్నాడు వంతులుగారు.

ఏటిగట్టు మీదికెక్కి వరద గోదారికి చేతులు జోడించాడు గడ్డెయ్య.

"గోదావరి తల్లీ! ఏంటి ఈ బీకరం? ఊరోళ్ళ తప్పులు మన్నించేసి నల్లంగ నూడు తల్లీ! వంతులుగోరు అమాయకులు! ఆరిబిడ్డకి ఏ ఆవదా రాకుండా నూడు."

గడ్డెయ్య మకాంలోకి అడుగెట్టాడు.

ఆ మకాంకి గోచీపెట్టుకున్న వయస్సులో అడుగెట్టాడు తను. ఇప్పటికి యాభైఏళ్ళు గడిసిపోతున్నాయ్.

ఏళ్ళు గడిసే కొద్దీ యజమాని మీద 'భకితీ ఇస్వానం' పెంచుకున్నాడే కానీ...తుంచుకోలేదు.

ఆ వందెకరాల మకాంలో...చేను గట్టుమీద తలెత్తిన ప్రతీ గడ్డి మొక్కా గడ్డెయ్యకి పరిచయమే.

వరధ్యానంగా నడుస్తున్న గడ్డెయ్య కోడెగిత్త బుసకొట్టగానే ఉలికివడ్డాడు.

"నీ...తన్నదియ్యా!"

ఓ అడుగు వెనక్కివేసి—ఆ గిత్త దూడకే

చూస్తూ నిలబడిపొయ్యాడు.

గిత్తదూడ కోవంగా తలాడిస్తూ బు

కొడుతోంది.

క్రమేపీ గడ్డెయ్య బుంగ మీసాల వెను

చిరునవ్వు దోబూచులాడింది.

"ఒరేయ్!! ఎదవకానా!! నేన్నీకు ఏం అవకార

సేసినావ్రా? ఆఁ... ఎందుకురా నన్ను నూసి

కొమ్మినురుతావ్?"

ప్రేమగా కఱ్ఱతో గడ్డివరకల్ని గిత్తముందుక

పొగెట్టాడు గడ్డెయ్య.

తన కళ్ళ ముందు వుట్టినగొడ్డు దా

ఆలనాపాలనా మూడేళ్ళ నుంచీ తన చేతి మీ

జరుగుతోంది. మరి తనను చూడగానే ఎందుక

కొమ్మి నురుతుందో గడ్డెయ్యకి అర్థం కాలేదు.

ఆ గిత్తకేసి చూస్తుంటే గడ్డెయ్య

నరిసిగాడు గుర్తుకొచ్చాడు. నరిసిగాడ

గడ్డెయ్యకొడుకే. ఆడూ ఇంతే!

"కిందటేడు దాకా పెద్దిరాజు పేరు సెపితే

దండం ఎట్టేవోడు ఏమైందో ఏటో ఇప్పుడు

పెద్దిరాజు ఊసెత్తితే సాలు తుబుక్కున

ఉమ్మేత్తాడు! మాయదారి కాలం! ఎవరిక

సెప్పలేం!" అనుకున్నాడు గడ్డెయ్య.

గడ్డెయ్యకి నరిసిగాడు ఒక్కడే. తల్లిలేని

పిల్లాణ్ణి కూడా తిప్పుకుని పెద్దోణ్ణి చేసేడు

పెద్దిరాజు సొమ్ముతోటే పెంచాడు. ఆయన

సొమ్ముతోటే ఓ పిల్లని వెదికి తెచ్చి నరిసిగాణ్ణి ఓ

ఇంటివాణ్ణి చేశాడు.

గడ్డెయ్యలకి కోడలు పిల్ల లచ్మి జ్ఞాపక

వచ్చింది.

ఒజ్జిరం లాంటి పిల్ల. వందెకరాల మకాం

నరిసిగాడు—లచ్మి తిరుగుతుం

సిలకాగోరింకల్లా ఉండేవోరు. ఏం వొండి

మొగుడికన్నా ముందు "తిను మావయ్యా" అ

తనకే పెట్టేది—పెద్దంతరం సిన్నంతర

తెలిసిన పిల్ల.

'కోడలి పిల్ల నల్లటి సేతుల్లోనే నల్లగా తన బతుకు తెల్లారిపోద్ది అనుకున్నా...ఎఱ్ఱిపిల్ల...తన కళ్ళ ముందే జలమ సాలించేసింది.'

గడ్డెయ్యకి ఆనాటి హడావిడి అంతా కళ్ళ ముందు కదలాడింది.

ఏడాది మీద ఆరునెల్లైంది.

ఆ రోజు పొద్దున్నే గడ్డెయ్య, నరి సింగాడూ మెరకచేలో బెడ్డ తీయించి వస్తున్నారు.

చిన్నపాలేరు కిట్టిగాడు వరిగెత్తుకుంటూ ఎదురొచ్చాడు.

"లచ్చిం పిన్ని పురుగుల మందు మింగేసినాది. కిందడి కొట్టుకొంటోంది."

కిట్టిగాడి మాటలు విని గడ్డెయ్య రాయైపోయాడు.

నరి సింగాడు గాల్లా వరిగెత్తాడు దిబ్బకి. వెళ్ళి చూస్తే ఏముంది? లచ్చి! నోట్లో నురగల్తో పడిపోయి ఉంది.

గడ్డెయ్య దిబ్బకి వెళ్ళేసరికి నరి సింగాడు లచ్మిని ఒళ్ళోకి తీసుకుని గోలుగోలున ఏడుస్తున్నాడు.



క్షణాల మీద ఈ వార్త పెద్దిరాజు ఇంటికి చేరింది. పెద్దిరాజు ఊళ్ళోలేడు. హైదరాబాద్ పోయాడుట.

ఎవరో మోటారు సైకిల్ మీద డాక్టర్ కోసం పట్నం వెళ్ళారు. కానీ డాక్టరు వచ్చేసరికే అంతా అయిపోయింది.

తండ్రీ కొడుకు లిద్దరూ లచ్మిని బూడిద చేసి వచ్చారు.

గడ్డెయ్యకి ఈనాటికీ అర్థం కాలేదు—కోడలు పిల్ల ఎందుకు విషం మింగిందో?

నరి సింగాడూ—లచ్మీ మాటా మాటా అనుకోడం ఒక్కసారి కూడా తన సెవులబళ్ళేదు. అన్నోన్నెంగానే ఉండేవోరు.

తనకి తెలిసినందాక—ఆ పిల్లకి ఏం కట్టం లేదు.

"మరి...మరి...ఎందుకు అర్దాంతరంగా నచ్చిపోనాది?

పాపం! నరి సింగాణ్ణి సూస్తే గుండెలు సెఱువైపోతన్నాయ్.

ఎక్కడెక్కడికో ఎగురుదామని గూడు నుంచి బయటికొచ్చిన గువ్వల జంటలో ఓ పక్షి నేలరాలిపోగా—బిత్తరపోయిన రెండోపక్షిలా అయిపోయాడు నరి సింగాడు.

లచ్మి చచ్చిపోయిన వారానికి తన తువ్వాలూ, చొక్కా బుజాన్నేసుకు పెద్దిరాజు మకాం నుంచి బయటికొచ్చేశాడు నరి సింగాడు.

"ఎక్కడ్డికీ ఎళ్ళమాకురా" అని కొడుకుని కాళ్ళా వేళ్ళా పడి బతిమాలుకున్నాడు గడ్డెయ్య.

"ఒరేయ్, బాబా! ఈ పాపిట్టి మకాంలో ఇంక ఓ ఛనం కూడా నిలబళ్ళేను. పెళ్ళాం నచ్చిపోయింది గదాని పిచ్చెక్కి దేశాలు పట్టిపోయే బెరుకుగుండెల వోణ్ణీ కాను. పేటలోకి పోతాను. నన్నాపకు."

విసురుగా ఏటిగట్టు ఎక్కేశాడు నరి సింగాడు.

గడ్డెయ్య గట్టిగా నిట్టూర్చాడు వెళ్ళిపోతున్న నరి సింగాణ్ణి చూసి.

"మనను కుదురుకున్నాక ఆడేఒత్తాడు" మనసుకి సద్ది చెప్పుకున్నాడు.

పేటలో మకాం పెట్టిన నరి సింగాడు పూర్తిగా మారిపోయాడు.

సమయం వచ్చినప్పుడల్లా పెద్దిరాజును తిట్టడం మొదలెట్టాడు.

పెద్దిరాజును తిట్టే గూడెం కుర్రాళ్ళతో సావాసం చెయ్యడం, తిరగడం ప్రారంభించాడు.

గడ్డెయ్య తన కొడుక్కి నయానా భయానా చెప్పి చూశాడు. ఉహుఁ... వాడు లొంగలేదు. దారికి రాలేదు.

"మళ్ళీ మనువు సేత్తారా నరి సింగా" అంటే విన్లేదు.

దేవుడి కో దండం పెట్టి వాడి గొడవ వదులుకున్నాడు.

ఎక్కడో ఫెళ్ ఫెళ్ ఫెళ్ మంటూ ఉరిమింది.

గడ్డెయ్య ఈ లోకంలోకి వచ్చి పడ్డాడు.

బాగా చీకటి పడిపోయింది. వరద జల్లులు పడుతూనే ఉన్నాయ్. కడుపులో ఆకలిగానే ఉంది కానీ...తడి కమ్మల్తో పొయ్యి ముట్టించడానికి బద్దకించి నులకమంచం మీద కూర్చుండిపోయాడు.

కిట్టిగాడు తాటాకు గొడుగు పంచన పెట్టి పాకలోకి వచ్చాడు.

"ఏరా?? బువ్వ దినొచ్చినావా?"

తలూపాడు వాడు.

"ఈ మునుర్న ఏం ఒండుకుంటావని—మ యమ్మ నీకు జావకా సి పంపినాది. ఇగో తీనుకో."

గోరువెచ్చని జావ కంఠం దిగుతుంటే, గడ్డెయ్యకి ప్రాణం లేచొచ్చినట్లైంది.

"అద్సరేగా నొరే! వంతులుగో రమ్మాయికి ఎట్టా ఉంది?"

"ఆ యమ్మకి పెనవం అయ్యిందంట. తల్లీ పిల్లాడూ బాగానే ఉన్నారంట. రత్తమ్మత్త సెప్పినాది."

గడ్డెయ్యకి ప్రాణం కుదుటపడింది.

"తాతా! తాతా!"

"ఏందిరా?"

"ఊళ్ళో అందరూ బెంబేలు పడిపోతున్నారు. పేటంతా పెద్దిరాజుగోరి డాబాలోకి నద్దుకుంటున్నారు. కుంటోడికి పోయే పేనం వొచ్చే పేనంగా ఉంది. అణ్ణీ మంచంతోటే కామందు డాబాలోకి మోనుకుపోతున్నారు. ఈ వొరద తగ్గుతుందంటావా?"

గడ్డెయ్య ఆలోచనలో పడ్డాడు.

లోకంలో దరమం నశించిపోతున్నది. చెట్టూ పుట్టా, నీరూ నిప్పూ మడి సిమీద పగొట్టినాయ్. కుతంతరాలు—కుచ్చితాలూ పెరిగిపోతన్నాయ్. దరమం ఒంటికాలుమీద...కాదు—కాదు...కుంటి కాలుమీద నిలబడ్డాది కామోను? తనలో తను గొణుక్కున్నాడు.

నరి సిగాడు ఎక్కడున్నాడో?

పెద్దిరాజు పేరు సెబుతే అగ్గిబుగ్గైపోయేవాడు. ఆయన లోగిల్లోకి ఎళ్ళడు గాక వెళ్ళడు. ఈడకి వొచ్చే సినా బాగుండేది.

గడ్డెయ్యలోని తండ్రి పేగు కదిలింది.

ఈదురుగాలికి దీపం టపటపా కొట్టుకుంటోంది.

పాకలో పశువులు నాల్రోజుల్నించి నిలువుకాళ్ళమీద ఉండిపోయాయ్. పాకంతా రొచ్చు రొచ్చు.

గడ్డెయ్యకి నెల్రోజుల క్రితం భూమ్మీద పడ్డ లేగదూడని చూడగానే మనసు కరిగిపోయింది.

నెమ్మదిగా వెళ్ళి లేగదూణ్ణి చేతులుమీద మోసుకొచ్చి తన నులకమంచంమీద పడేశాడు. వెఱ్ఱిముండ చలికి వణికిపోతోంది.

అది వెచ్చవెచ్చగా చేతులు నాకుతుంటే దాని పక్కనే మంచంమీద మునుగొట్టుకుని కూర్చున్నాడు గడ్డెయ్య.

ఎప్పుడు, నిద్దర పట్టిందో—తెలివొచ్చేసరికి ఈదురుగాలి గజగజలాడిం చేస్తోంది. గడ్డెయ్య బయటికి చూశాడు.

గడ్డెయ్య మంచంమీంచి లేచాడు. ఎల్లాగుందో వరద?

తాటాకు గొడుగు వేసుకుని ఏటి గట్టెక్కాడు. గోదారి పెరిగింది. ఏటిగట్టు పక్క నల్లతుమ్మచెట్టు పూర్తిగా మునిగిపోయింది. మరో అడుగు పెరిగితే ఏటిగట్టు ఆపదు.

ఎవరో గట్టుమీద నిలబడ్డట్టు కనిపించింది గడ్డెయ్యకి.

"ఎవడ్రా అక్కడ?" గడ్డెయ్య కంఠం ఖంగుమంది.

జవాబు లేదు.

అద్దరేతిరి ఏటిగట్టుమీద ఆ మని సి ఏం జేత్తున్నాడు? వాడి చేతిలో ఏవిటి?

గొడుగు పక్కన పడే సి—గడ్డెయ్య ముందుకు నడిచాడు.

గబాల్ని వెళ్ళి ఆ మనిషిని ఒడి సి పట్టుకున్నాడు.

"ఒదల హె! ఒదులు!"

"ఎవడ్రా నువ్? ఆఁ..."

"నేనే!" నరి సిగాడి కంఠం ఖంగుమంది.

గడ్డెయ్య కళ్ళు చిట్లించి మరీ చూశాడు. నరి సిగాడి చేతిలో గునపం ఉంది. ఏటి గట్టుకు గోదారివైపు గండి పెడుతున్నాడు నరి సిగాడు.

గడ్డెయ్య నరి సిగాణ్ణి వదిలేశాడు. నిర్ఘాంతపోయాడు.

"నడి సిగా! ఏం పనిరా ఇది?" గడ్డెయ్య కంఠం వణకింది.

"ఒరేయ్! బాబా! నాకు అడ్డం రాకు! నీకు పేనంమీద తీపి ఉంటే ఈ మకాం వదిలే సి పో! ఎళ్ళు!"

"ఒరేయ్! నరి సిగా ఎందుకురా ఇలా తయారయ్యావ్? ఎందుకురా కన్న ఊరికి ద్రోహం సేత్తన్నావ్?"

నరి సిగాడు అన్నాడు: "పాపం సే సినోడు పలితం అనుబవించవలి సిందే! పెద్దిరాజుగాడి సేలన్నీ వరదలో మునిగి కుళ్ళిపోవాల్సిందే! ఆడి వందెకరాలు మట్టి సే సేస్తా! లే! గునపం వదులు!"

గడ్డెయ్యకి ఒళ్ళు జలదరించింది.

"ఒరేయ్! ఏంటిరా! నీకు పిచ్చికానీ ఎక్కిందా? పచ్చని సేలు నీటిపాలు సెయ్యడానికి నీకు సేతులెల్లా వస్తన్నాయిరా? ఈ గడ్డెయ్య కొడుకువయ్యుండి నీ కీ బుద్ధులెల్లా వచ్చాయిరా?"

"అవున్రా! బాబా! నాను పిచ్చోణ్ణే! పెద్దిరాజు నాకు సే సిన ద్రోహం ఇంటే నీకు పిచ్చెక్కుతాదిరా! నా లచ్చిని బలవంతంగా అనుబవించాడ్రా! దాన్ని వేటాడి వేటాడి సంపేసాడ్రా!! ఒరేయ్ మునలోడా! నువ్ నమ్మగలవట్రా...ఆ వేళ... నీ కన్నా నేను లచ్చి దగ్గరికి ముందే లగెత్తుకెళ్ళాను. అప్పటికి దానికింకా మాట పడిపోలేదు. దాని నోటితో అది సాయంగా సెప్పిందిరా! తండ్రి నాటోడు...తనమీద సే సిన గోరానికి...బిక్కైపోయి నా లచ్చి...పురుగులమందు మింగే సి నచ్చిపోయింది."

ఆవేశంలో నరి సిగాడికి మాటలు తడబడసాగాయ్.

గడ్డెయ్య తన చెవులు తానే నమ్మలేకపోతున్నాడు.

'నిజమా! పెద్దిరాజు మేకవన్నెపులి లాంటోడా? లచ్చిని కాటేశాడా?'

పెద్దిరాజు మకాంకే సి చూశాడు గడ్డెయ్య.

కొబ్బరిచెట్లు పడగవిప్పిన త్రాచుల్లాగా తల లూపుతున్నాయ్.

ఆ క్షణంలోనే గడ్డెయ్య ఓ నిర్ణయానికొచ్చాడు.

"ఒరే నర్సిగా! మళ్ళీ ఆ మకాంలో మనం అడుగెట్టొద్దు. ఆ గునపం అక్కడ పడెయ్యి. మరో ఊరు పోదాం పద! రా!"


నర్సిగాడికి ఆ మాటలు తలకెక్కలేదు.

గునపంతో గట్టును విరగబొడుస్తూనే ఉన్నాడు.

గడ్డెయ్య కొడుకును గెడ్డం పుచ్చుకుని బతిమాలుకున్నాడు. "ఒరేయ్ నరి సిగా! కోపంలో నువ్వేం జేస్తున్నావో నీకు తెలీటంలేదు. పెద్దిరాజుమీద నీకు పగుంటే ఈ గునపం ఆడి గుండెలో దిగెయ్యి. నా నడ్డురాను. ఇగో సూడు. పచ్చని సేల్ని...పదిమంది తినే కూడునీ నాశనం సేత్తన్నావ్. ఆ సేలు నీకేం అన్నేయం సేసాయిరా! ఆ దిబ్బమీది మూగజీవాలు నీకేం అపకారం సే సినాయిరా! నా మాటిను! పెద్దోణ్ణి సెబుతున్నాను...ఒద్దు...గట్టుకి గండి ఎట్టొద్దు."

"ఒరేయ్! ము సిలోడా! పెద్దిరాజు గుండెలో గునపం దిగే సేవోణ్ణిరా! అణ్ణీ...ఆడి భూవుల్నీ నట్టాలు రచ్చిత్తాయ్! నా లచ్చిని వోరు రక్షించార్రా? పేటలో ఈ ఇనయం తెలిత్తే...పరువు పోతాదని—గుండెలోనే బాధని దాసుకుని ఎత్తెక్కిపోయినావ్రా! లే! తప్పుకో! నా క్కోపం తెప్పించకు! పెద్దిరాజు సేలన్నీ సిపురుతో ఊడ్చినట్టు ఊడ్చుకు పోవాల! అంతే!"

నరి సిగాడు గడ్డెయ్య చేతుల్లోంచి గునపం



విడిపించాడు.

గడ్డెయ్యకి ఏం చెయ్యాలో పాలుపోలేదు.

లాభంలేదు. ఇంక ఆలి స్యెం సేత్తే పెద్దిరాజు మకాం మాత్తరవేఁ కాదు! ఛనంలో ఊరు ఊరంతా మునిగిపోద్ది.

గడ్డెయ్య గభాల్న వెళ్ళి నరిసిగాణ్ణి కిందకు పడగొట్టాడు.

తండ్రీ కొడుకు లిద్దరూ ఒక్కసారే దభీలని కిందపడ్డారు.

తప్పొప్పుల్ని విడదీసి మంచికి మంచి, చెడుకి చెడు వేరు వేరుగా చూసే పండిన వయస్సు ఒకరిది.

ఒక తప్పుకు మరో తప్పు—ఒక ద్రోహానికి మరో ద్రోహం నమాధానం అనుకుంటున్న రేగిన మనస్సు మరొకరిది.

నరిసిగాడు గడ్డెయ్యని దూరంగా తోసేశాడు.

గడ్డెయ్య పది గజాల దూరంలో పడ్డాడు.

నరిసిగాడు గునపం పట్టుకుని రొప్పుతూ అన్నాడు. "ఇగో! ముసిలోడా! జలమ నిచ్చినోడివని నంపకుండా ఇడిసిపెట్టాను. మరొకడైతే—ఈ గునపం ఆడి గుండెలోకి ఇసిరేవోణ్ణి. తెలిసిందా...పేనంమీద ఆశ ఉంటే నీ దార్ని నువ్ ఫో. దేవు డడ్డొచ్చినా నరే—ఈ గునపంతో పొడిచేత్తా! తెలిసిందా?"

నరిసిగాడు తోసినతోపుకి గడ్డెయ్య కూలబడిపోయాడు.

కళ్ళు తిరిగినట్లయింది.

ఆ అస్తవ్యస్త మానసికావస్థలో గడ్డెయ్య చెవుల్లో వేల గొంతుల హాహాకారాలు—ఆర్తనాదాలు వినబడసాగాయ్.

గడ్డెయ్య చెవులు బ్రద్దలైపోతున్నాయ్.

"గడ్డెయ్యా! రక్షించవూ?" కళ్ళ నీళ్ళతో, ఒక్క రోజు వయసుగల పసిగుడ్డుని చేతుల్లో పెట్టుకుని బ్రతిమాలుతున్న పంతులుగారి కూతురు పచ్చిబాలెంత.

"ఒరే! గడ్డెయ్యా! నంపెయ్యకు...రా...నంపెయ్యకు..." చేతులు జోడించి దండం పెడుతున్న కుంటోడు రోగిష్టివాడు.

"అంబా! అంబా! అంబా!" చుట్టుముట్టిన వరద నీటిలో—నుడిగుండంలో బడి—ఈత చేతకాక వెఱ్ఱిగా అరుస్తున్న నెల్రోజుల వయస్సుగల లేగదూడ.

"గడ్డెయ్యా, మమ్మల్ని బ్రతికించవూ?" గాలికి ఊగిపోతున్న పచ్చని చేలోని వరిమొక్కలు ఒక్కొక్కటీ దీనస్వరంలో పిలుస్తున్న పిలుపులు!

గడ్డెయ్య తల విదిల్చుకుని చూశాడు.

నరిసిగాడు గండిపెట్టడంలో లీనమైపోయాడు.

గడ్డెయ్య లేచాడు. పులిలా కాదు...పిల్లిలా! అడుగులో అడుగేసుకుంటూ నరిసిగాడికేసి నడుస్తున్నాడు.

రక్తసంబంధాని కతీతమైన ధర్మపరిపాలనా బుద్ధితో నడుస్తున్నాడు.

వేల ప్రాణాలు నిలబెట్టే ఆపద్బాంధవుడిలా ముందుకు అడుగు వేస్తున్నాడు.

గడ్డెయ్య కాలు ఎత్తాడు...త్రివిక్రముడిలా!

మరుక్షణంలో నరిసిగాడు వరదగోదారిలో పడ్డాడు!

"ఏ...ఏ...య్...య్...య్..."

నరిసిగాడి కంఠం దిగంతాల మార్మోగి వరదగోదార్లో కలసిపోయింది.

గడ్డెయ్య విభ్రాంతిగా అలా చూస్తూనే ఉండిపోయాడు!

తెప్పరిల్లిన గడ్డెయ్య మామూలు మనిషిలా ఏడుస్తూ కింద పడి దొర్లుతున్నాడు!

అతని గుండెలో వరదగోదారి పొంగులెత్తుతోంది!

దాన్ని ఆపగలిగేవాళ్ళెరీ?...ఎక్కడ?

★

## చిక్కు

ఒక రాజకీయ నాయకుడు ఎన్నికల ప్రచారంలో నోటికొచ్చినట్లు వాగ్దానాలు చేసి పారేశాడు. 'గ్రామానికో బస్సు' ఆయన పథకాల్లో ఒకటి. ఆయన ఎన్నికలలో గెలిచి మంత్రి అయ్యాడు.

ఒక గ్రామం నుంచి గ్రామ పెద్దలు వచ్చి "మంత్రిగారూ! మా గ్రామానికి బస్సు సౌకర్యం లేదు. వెంటనే వేయించండి" అన్నారు.

"నాకూ వేయించాలనే ఉందయ్యా. కానీ మీ ఊరికి రోడ్డు లేదుగా?" అన్నాడు మంత్రి.

-నగేష్

